మోసం చేయడం బాబు నైజం

- వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజకవర్గ సమన్వయకర్త కోన రఘుపతి
- సంగుపాలెం కోడూరులో చంద్రబాబు మోసాలపై 'రచ్చబండ'



సంగుపాలెం కోడూరు(కర్లపాలెం): ప్రజలను మోసం చేయటం ముఖ్యమంత్రి చంద్రబాబుకు వెన్నతో పెట్టిన విద్య అని బాపట్ల మాజీ ఎమ్మెల్యే, వైఎస్సార్ సీపీ బాపట్ల నియోజక వర్గ సమన్వయ కర్త కోన రఘుపతి చెప్పారు. పిట్టలవానిపాలెం మండలంలోని సంగుపాలెం కోడూరు గ్రామంలో శుక్రవారం రాత్రి వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు ఉయ్యూరి లీలా శ్రీనివాసరెడ్డి అధ్యక్షతన బాబు ష్యూరిటీ– మోసం గ్యారంటీ రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సభకు ముఖ్య అతిథిగా విచ్చేసిన కోన రఘుపతి మాట్లాడుతూ మాట ఇస్తే మడమ తిప్పని మాట తప్పని నేత వైఎస్ జగన్ నవరత్నాల పథకాలను సక్రమంగా అమలు చేశారని చెప్పారు. వైఎస్ జగన్ రాజకీయాలు, కుల మతాలకు అతీతంగా అనేక సంక్షేమ పథకాలకు బటన్‌లు నొక్కి అందజేశారని చెప్పారు. అధికారంలోకి వచ్చి ఏడాది దాటుతున్నా చంద్రబాబు ఏ ఒక్క పథకం సక్రమంగా ఇచ్చింది లేదన్నారు. నిరుద్యోగ భృతి ఇస్తామని చెప్పి అధికారంలోకి వచ్చి సంవత్సరం అయినా ఇవ్వకుండా యువతను చంద్రబాబు మోసం చేశారన్నారు. అధికారంలోకి వచ్చిన తరువాత మహిళలకు ఫ్రీ బస్సు సౌకర్యం కల్పిస్తామని రాష్ట్రంలో ఎక్కడికైనా మహిళలు టిక్కెటు లేకుండా ప్రయాణించవచ్చునని ప్రగల్భాలు పలికిన చంద్రబాబు ఇప్పుడు జిల్లా వరకే పరిమితం అంటూ మాట్లాడడం మహిళలను మోసం చేయటం కాదా అని కోన ప్రశ్నించారు. గ్రామ సర్పంచ్ శివకుమారి, ఎంపీపీ దెందుకూరి సీతారామరాజు, వైఎస్సార్ సీపీ సంగుపాలెం గ్రామ అధ్యక్షుడు పారె ధనుంజయ్‌రావు, మాజీ ఎంపీపీ షేక్ బాజీ, మైనార్టీ రాష్ట్ర నాయకుడు అహ్మద్ హుస్సేన్, వైఎస్సార్ సీపీ యువజన విభాగం మండల అధ్యక్షుడు షేక్ మౌలాలి, నాయకులు మండే విజయ్‌కుమార్, బడుగు ప్రకాష్, దొంతిరెడ్డి కోటిరెడ్డి, పాణ్యం శ్రీనివాసరావు, నర్రా రమేష్, వాలి శివారెడ్డి, అశోక్, రామారావు శరవయ్య, సాంబశివరావు, బుల్లియ్య, తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

బాలికలకు శక్తి యాప్‌పై అవగాహన



భట్టిప్రోలు: బాలికలు ఏదైన ప్రమాదంలో ఉన్నప్పుడు సెల్‌ఫోన్‌లో కేవలం ఒక బటన్ నొక్కడం ద్వారా తక్షణమే పోలీస్ సహాయం పొందవచ్చునని నగరం ఎస్ఐ భార్గవ్ తెలిపారు. ప్రభుత్వం రూపొందించిన శక్తి యాప్ గూర్చి శనివారం భట్టిప్రోలు విశ్వశాంతి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌లో బాలికలకు అవగాహన కల్పించారు. ఎస్ఐ భార్గవ్ మాట్లాడుతూ యాప్ వినియోగదారులు జీపీఎస్ స్థానాన్ని గుర్తించి సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు సమాచారం పంపాలని పేర్కొన్నారు. బాధితులు వివరాలను గోప్యంగా ఉంచుతామని తెలిపారు. శక్తి యాప్‌ను ప్రతి విద్యార్థి ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకోవాలని సూచించారు. కరస్పాండెంట్ ఎంపీ వెంకట్రావు, ప్రిన్సిపాల్ ఫణి పార్ధసారధి, ఉపాధ్యాయులు, సిబ్బంది పాల్గొన్నారు.

హెచ్‌ఐవీపై సమగ్ర ఆరోగ్య ప్రచారం



వేమూరు: మండల కేంద్రంలోని గ్రామ సచివాలయం–2 పరిధిలో హెచ్‌ఐవీపై సమగ్ర ఆరోగ్య ప్రచారం నిర్వహణ కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా పీహెచ్‌సీ వైద్యులు డాక్టర్ సౌమ్య మాట్లాడుతూ ఏపీ ఎయిడ్స్ నియంత్రణ సొసైటీ ఆదేశాల మేరకు జిల్లా ఆరోగ్య శాఖ ఆధ్వర్యంలో డిస్ట్రిక్ ఇంటిగ్రేటెడ్ స్ట్రాటజీ ఫర్ హెచ్‌ఐవీ, ఎయిడ్స్ కార్యక్రమం గ్రామంలో నిర్వహించామన్నారు. కార్యక్రమంలో ఐసీటీసీ కౌన్సిలర్ పేరమ్మ, ల్యాబ్ టెక్నీషియన్ నాగశ్రీ, జ్యోత్స్న, ఏఎన్ఎం పిచ్చిమ్మ, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

కౌలు దారులకు బ్యాంక్ రుణాలు

అమర్తలూరు(వేమూరు): గుర్తింపు కార్డులు పొందిన కౌలు రైతులకు బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించడం జరుగుతుందని బాపట్ల సహాయ వ్యవసాయ సంచాలకులు కె.ధనరాజ్ అన్నారు. మండల కేంద్రంలోని రైతు సేవా కేంద్రంలో మండల వ్యవసాయ సహాయకులు, ఉద్యానవన సహాయకులు, విత్తనాలు, పురుగుమందులు, ఎరువుల డీలర్లతో శనివారం ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఏఓ ఎం.హేమంత్ భరత్ కుమార్ అధ్యక్షత వహించారు. ధనరాజ్ మాట్లాడుతూ గ్రామ వ్యవసాయ సహాయకులు రైతులకు అందుబాటులో ఉండాలన్నారు. ఖరీఫ్ సీజన్ ప్రారంభం కావడంతో కౌలు రైతులందరకీ కార్డులు త్వరగా ఇప్పించాలన్నారు. పంట నమోదు ప్రక్రియ ప్రారంభం కాబోతుందని, పంట నమోదు పక్రియకు సిద్ధం కావాలన్నారు. వ్యవసాయ విస్తరణాధికారి బి.మణికంఠ, డి.మాధవి, గ్రామ వ్యవసాయ సహాయకులు పాల్గొన్నారు.

సేవారత్న అవార్డు గ్రహీత సీతాపతికి సన్మానం



నగరం: సామాజిక సేవ చేసిన ప్రతి ఒక్కరికీ గుర్తింపు లభిస్తుందని ఎస్ఐ బి.భార్గవ్ చెప్పారు. స్థానిక వేంకటేశ్వరస్వామి దేవస్థానం కల్యాణ మండపంలో శనివారం సేవారత్న అవార్డు పొందిన యల్లాప్రగడ సీతాపతికి సన్మానం జరిగింది. ఈసందర్భంగా ఎస్ఐ మాట్లాడుతూ సామాజిక కార్యక్రమాలలో ప్రతి ఒక్కరూ భాగస్వామ్యులు కావాలన్నారు. అనంతరం సీతాపతిని దుశ్శాలువాలు, పూల మాలలతో ఘనంగా సన్మానించారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

విద్యార్థులకు నోట్ పుస్తకాలు పంపిణీ



బాపట్లటౌన్: దాతల సహకారంతో ప్రభుత్వ పాఠశాలలు బలోపేతం అవుతాయని ఎంఈఓ ఎస్.నిరంజన్ తెలిపారు. మండలంలోని చెరువుజమ్ములపాలెం ప్రాథమిక పాఠశాలలో శనివారం జేసీఎస్ఎంఎస్ సర్వీస్ సొసైటీ అధ్యక్షుడు కన్నెగంటి జాన్‌వెస్లీ ఆధ్వర్యంలో విద్యార్థులకు నోట్ పుస్తకాలను పంపిణీ చేశారు. ఎంఈఓ ఎస్.నిరంజన్ మాట్లాడుతూ దాతల సహాయాన్ని అందిపుచ్చుకొని విద్యార్థులు కష్టపడి చదివి భవిష్యత్‌లో ఉన్నత శిఖరాలను అధిరోహించాలన్నారు. భవిష్యత్‌లో ఉన్నతస్థాయిలో స్థిరపడిన తర్వాత పేదవిద్యార్థులకు సహాయం చేసేస్థాయికి ఎదగాలన్నారు. ఉపాధ్యాయులు ఎం.ప్రకాశవర్ధిని, జె.శ్యామ్‌సుందరి, బి.భారతి, పాస్టర్ బుర్రా మోజెస్, సొసైటీ సభ్యులు కట్టా విజయ్‌రాజు, జయపాల్ పాల్గొన్నారు.

ఆక్రమణలు స్వచ్ఛందంగా తొలగించుకోండి

మున్సిపల్ కమిషనర్ సాంబశివరావు


రహదారి మార్జిన్‌లోని ఆక్రమణలను తొలగిస్తున్న మున్సిపల్ సిబ్బంది

రేపల్లె: స్వచ్ఛ భారత్ – స్వచ్ఛ రేపల్లె కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని రహదారి మార్జిన్లలో ఉన్న ఆక్రమణల తొలగింపునకు శ్రీకారం చుట్టినట్లు మున్సిపల్ కమిషనర్ కాకర్ల సాంబశివరావు తెలిపారు. నెహ్రూ బొమ్మ సెంటరులో శనివారం నిర్వహించిన ఆక్రమణల తొలగింపు కార్యక్రమాన్ని ఆయన పర్యవేక్షించి మాట్లాడారు. రహదారి మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకోవటం వల్ల రహదారులు కుచించుకుపోయి ట్రాఫిక్ సమస్య అధికమవుతోందన్నారు. పట్టణాన్ని ఆదర్శవంతంగా తీర్చిదిద్దటంలో భాగంగా ఆక్రమణలను తొలగిస్తున్నామన్నారు. మార్జిన్‌లను ఆక్రమించి వ్యాపారాలు చేసుకునే వారికి ఇప్పటికే పలుమార్లు నోటీసులు జారీ చేశామన్నారు. వ్యాపారులు స్వచ్ఛందంగా తమ ఆక్రమణలను తొలగించుకుని సహకరించాలన్నారు. పది రోజుల్లో ఆక్రమణలు మొత్తం తొలగింపు కార్యక్రమం పూర్తవుతుందని చెప్పారు. శానిటరీ ఇనిస్పెక్టర్ ఆకురాతి రామచంద్రరావు, టౌన్‌ప్లానింగ్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

పాలిథిన్ రహిత సమాజానికి కృషిచేద్దాం

ఆర్డీఓ రామలక్ష్మి


రేపల్లె పట్టణంలో ర్యాలీలో పాల్గొన్న వివిధ పాఠశాలల విద్యార్థులు

రేపల్లె: పర్యావరణ పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆర్డీఓ నేలపు రామలక్ష్మి పిలుపునిచ్చారు. స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా మున్సిపాలిటీ ఆధ్వర్యంలో పట్టణంలోని వివిధ పాఠశాలల విద్యార్థులతో శనివారం నిర్వహించిన ర్యాలీలో ఆమె పాల్గొని మాట్లాడారు. ప్లాస్టిక్ వినియోగంతో ముఖ్యంగా సింగిల్ యూజ్ పాల్‌థిన్‌తో పర్యావరణానికి హాని పొంచి ఉందన్నారు. పాలిథీన్ రహిత సమాజానికి అందరూ కృషి చేద్దామన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులతో కలిసి రింగురోడ్డు వరకు ర్యాలీ నిర్వహించారు. రింగు రోడ్డు వద్ద మానవహారంగా ఏర్పడి నినాదాలు చేశారు. మున్సిపల్ చైర్‌పర్సన్ కట్టా మంగ, కమిషనర్ సాంబశివరావు, పట్టణ సీఐ మల్లికార్జునరావు, నాయకులు అనగాని శివప్రసాద్, మేకా రామకృష్ణ, పంతాని సాయికుమార్, కొలసాని రాము, వివిధ ప్రజాసంఘాల నాయకులు, వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొన్నారు.

వేమూరులో..

వేమూరు: ప్లాస్టిక్ నివారించేందుకు ప్రతి ఒక్కరూ బాధ్యత తీసుకోవాలని ఎంపీడీఓ పి.రవి కుమార్ తెలిపారు. ప్రభుత్వ ఉన్నత పాఠశాలల్లో సింగిల్ యూజ్ ప్లాస్టిక్ నిషేధంపై విద్యార్థులకు అవగాహన సదస్సు శనివారం నిర్వహించారు. తహసీల్దార్ కె.సుశీల, డిప్యూటీ ఎంపీడీఓ సీహెచ్ శేఖర్, పంచాయతీ కార్యదర్శి భూపతి రెడ్డి, గ్రామ సచివాలయం సిబ్బంది, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

భట్టిప్రోలులో...

భట్టిప్రోలు: వినియోగదారులు ఒక సారి మాత్రమే వాడే ప్లాస్టిక్, ఉత్పత్తుల వాడకం నిషేధించాలని ఎంపీడీఓ ఎస్.వెంకటరమణ తెలిపారు. 3వ శనివారం సందర్భంగా భట్టిప్రోలులో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం నిర్వహించారు. పుర వీధులలో ర్యాలీ నిర్వహించి, గ్రామ పంచాయతీ కార్యాలయం వద్ద సభ ఏర్పాటు చేశారు. తహసీల్దార్ మేకా శ్రీనివాసరావు, మండల సమాఖ్య ఏపీఎం గుడిమెట్ల శ్రీమన్నారాయణ, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

అమర్తలూరులో...

అమర్తలూరు(వేమూరు): పాలిథీన్‌ను ఉపయోగాన్ని నియంత్రించాలని ఎంపీడీఓ మారుతి శేషాంబ అన్నారు. స్థానిక జడ్పీ పాఠశాలలో స్వర్ణాంధ్ర – స్వచ్ఛాంధ్ర కార్యక్రమం శనివారం నిర్వహించారు. మండల ప్రత్యేకాధికారి వెంకటేశ్వర్లు, పద్మావతి, తహసీల్దారు నెహ్రూబాబు, ఎంఈఓ కనపాల రమేష్, డిప్యూటీ ఎంపీడీఓ జొన్నలగడ్డ విజయబాబు, అధికారులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

మంతెనవారిపాలెం(కర్లపాలెం): అందరూ పరిసరాల పరిశుభ్రత పాటించాలని పిట్టలవానిపాలెం మండల ప్రత్యేక అధికారి, డీఎల్‌డీఓ సీహెచ్ విజయలక్ష్మి చెప్పారు. స్వర్ణాంధ్ర– స్వచ్ఛభారత్ కార్యక్రమంలో భాగంగా పిట్టలవానిపాలెం మండలం మంతెనవారిపాలెంలో జరిగిన అవగాహన ర్యాలీ, మానవహారంలో డీఎల్‌డీఓ విజయలక్ష్మి పాల్గొన్నారు. గ్రామ సర్పంచ్ ఆదిలక్ష్మి, తహసీల్దార్ వెంకటేశ్వరరావు, ఎంపీడీఓ ఎ.ఎలీషాబాబు, ఎంఈఓ రాజారత్నం, చందోలు పీహెచ్‌సీ డాక్టర్ చంద్రిక, అంగన్‌వాడీ కార్యకర్తలు, విద్యార్థులు ఉన్నారు.

కర్లపాలెంలో...

కర్లపాలెం: అందరూ స్వచ్ఛత వైపు అడుగులు వేయాలని తహసీల్దార్ షాకీర్ పాషా, ఎంపీడీఓ అద్దూరి శ్రీనివాసరావు చెప్పారు. శనివారం కర్లపాలెంలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా విద్యార్థులతో కలసి అధికారులు ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీవో, తహసీల్దార్ మాట్లాడుతూ అందరూ తమ గృహాలను వీధులను పరిశుభ్రంగా ఉంచుకోవాలని చెప్పారు. పంచాయతీ కార్యదర్శి సునీత, ఈఓపీఆర్డీ శ్రీనివాసరావు, హెచ్ఎం తిరుపతి విజయశ్రీ,, ఉపాధ్యాయులు పోలీస్‌రావు, నారాయణ, వెంకటరావు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, విద్యార్థులు ఉన్నారు.

పరిసరాల పరిశుభ్రతతో సంపూర్ణ ఆరోగ్యం

ఏఆర్ డీఎస్పీ విజయసారధి


ఎస్పీ కార్యాలయ ఆవరణలోని పరిసరాలను శుభ్రం చేస్తున్న పోలీసులు

బాపట్లటౌన్: పరిసరాల పరిశుభ్రతతోనే సంపూర్ణ ఆరోగ్యం సాధ్యమని ఏఆర్ డీఎస్పీ విజయసారధి తెలిపారు. ఎస్పీ ఆదేశాల మేరకు జిల్లా పోలీస్ అధికారులు శనివారం స్వచ్ఛ ఆంధ్ర- స్వచ్ఛ దివస్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఏఆర్ డీఎస్పీ విజయసారధి మాట్లాడుతూ ప్రతి నెల మూడవ శనివారం స్వచ్ఛ ఆంధ్ర–స్వచ్ఛ దివస్ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతతో పాటు చుట్టూ ఉన్న పరిసరాలు కూడా పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. జిల్లా పరిధిలోని అన్ని పోలీస్‌స్టేషన్లు, జిల్లా ఎస్పీ కార్యాలయం పరిసరప్రాంతాల్లో పేరుకు పోయిన చెత్తాచెదారం, పిచ్చి మొక్కలను తొలగించారు. పబ్లిక్ ప్రదేశాలు, ప్రకృతిలో ప్లాస్టిక్ వ్యర్థాలు తగ్గింపు, సింగల్ యూజ్ ప్లాస్టిక్ వాడకం నిరోధించడం, పర్యావరణ అభివద్ధి, పరిశుభ్రమైన వాతావరణం గురించి ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఎస్బీ సీఐ నారాయణ, అడ్మిన్ ఆర్ఐ మౌలుద్దీన్, ఎంటీ ఆర్ఐ శ్రీకాంత్, ఇతర పోలీసు అధికారులు, ఏఆర్ సిబ్బంది పాల్గొన్నారు.

ఔట్ సోర్సింగ్ సమస్యలను పరిష్కరించండి

తెనాలిఅర్బన్: ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని సీఐటీయు నాయకులు కొల్లిపర బాబుప్రసాద్ డిమాండ్ చేశారు. తెనాలి ఇంజినీరింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో శనివారం మున్సిపల్ కార్యాలయం ముందు కొద్దిసేపు ఆందోళన చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జీవో నెంబర్ 36 ప్రకారం వేతనాలు చెల్లించాలని, ఉద్యోగులకు సంక్షేమ పథకాలు వర్తింపజేయాలని డిమాండ్ చేశారు. రిటైర్మెంట్ బెనిఫిట్స్, ప్రమాద భీమాను వర్తింపచేయాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయు నాయకుడు షేక్ హుస్సేన్‌వలీ, ఇంజనీరింగ్ యూనియన్ నాయకులు సురేష్, దిలీప్‌కుమార్, చక్రి, గోపికృష్ణ, ప్రశాంత్, ప్రదీప్; సునీల్, సతీష్; శ్రీధర్, ఎం.కృష్ణ, కరిముల్లా, ఈశ్వరరావు, కిరణ్‌కుమార్, ఉపేంద్ర, తదితరులు పాల్గొన్నారు.

నిధుల కేటాయింపులో వివక్షపై ఆగ్రహం



కొల్లూరు: నిధుల కేటాయింపులో వివక్షపై మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. శనివారం కొల్లూరు మండల పరిషత్ సాదారణ సర్వసభ్య సమావేశంలో సభ్యులు మండలపరిషత్ నిధులు కేటాయించే విషయంలో అభ్యంతరాలను వ్యక్తం చేశారు. గత సమావేశ సమయంలో నిధులు రూ. 70 లక్షలు ఉండగా, ప్రస్తుతం 15వ ఆర్థిక సంఘం నిధులు విడుదలైతేనే మినహా నిధులు లేవని అధికారులు వెల్లడించడంతో సభ్యులు ఆగ్రహానికి గురయ్యారు. నిధులు ఏమయ్యాయో తెలపాలని పట్టుపట్టడంతో రూ. 30 లక్షలు కొల్లూరులో అండర్ గ్రౌండ్ డ్రైనేజ్ నిర్మాణానికి కేటాయించడంతోపాటు, మరో రూ. 30 లక్షలు మండలంలోని జువ్వలపాలెం ప్రాంతంలో రహదారుల నిర్మాణానికి మంజూరు చేసినట్లు పేర్కొనడంతో సభ్యులు ఆగ్రహం వ్యక్తం చేశారు. కేవలం రెండు గ్రామాలకే రూ. 60 లక్షలు కేటాయించడంపై ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌ల నుంచి తీవ్ర అభ్యంతరాలు వ్యక్తమయ్యాయి. కృష్ణా నదిలో యంత్రాలతో ఇసుక తవ్వకాలు చేపడుతున్న కారణంగా భూగర్భ జలాలు అడుగంటిపోవడంతోపాటు, నీటి తీరులో మార్పు వచ్చిందని, తక్షణం తాగునీటి పంపులను ఏర్పాటు చేయాలని గాజుల్లంక, పెసర్లంక ఎంపీటీసీ సభ్యులు డిమాండ్ చేశారు. ఎంపీపీ కమ్మెల నాంచారమ్మ అధ్యక్షతన జరిగిన సమావేశంలో జెడ్పీటీసీ సభ్యుడు చొప్పర సుబ్బారావు, వైస్ ఎంపీపీ మురాల రాంబాబు పాల్గొన్నారు.

స్కూటీని ఢీకొన్న మినీ లారీ : వ్యక్తి మృతి



పిట్టలవానిపాలెం (కర్లపాలెం): స్కూటీని మినీలారీ ఢీకొనగా, ఓవ్యక్తి మృతి చెందిన సంఘటన మండల కేంద్రం పిట్టలవానిపాలెంలో శనివారం చోటు చేసుకుంది. చందోలు ఎస్ఐ ఎంవీ శివకుమార్ యాదవ్ తెలిపిన వివరాల మేరకు... పిట్టలవానిపాలెం గ్రామానికి చెందిన వేగేశన వెంకటేశ్వరరాజు (77) ఖాజీపాలెం వైపు నుంచి పిట్టలవానిపాలెం స్కూటీపై వస్తుండగా వెనుక నుంచి వచ్చిన మినీ లారీ స్కూటీని క్రాస్ చేస్తూ ఢీకొనటంతో వెంకటేశ్వరరాజు స్కూటీతో సహా రోడ్డుపై పడిపోవటంతో తీవ్ర గాయాలయ్యాయని ఎస్ఐ తెలిపారు. క్షతగాత్రున్ని స్థానిక సామాజిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించగా అప్పటికే మృతిచెందినట్లు డాక్టర్లు తెలిపారని మృతుని భార్య లలిత ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ వివరించారు.

గుర్తు తెలియని వ్యక్తి మృతి

తెనాలిరూరల్: గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన ఘటనపై రూరల్ పోలీసులు కేసు నమోదు చేశారు. వారు తెలిపిన వివరాల ప్రకారం రూరల్ గ్రామం అంగలకుదురు స్వధార్ హోమ్ సమీపంలో సుమారు 45 నుండి 55 సంవత్సరాల వయసున్న వ్యక్తి ఈనెల 17న సాయంత్రం ఫిట్స్‌తో రోడ్డుపై పడిపోయాడు. స్థానికులు గమనించి 108 అంబులెన్స్ సహకారంతో తెనాలి గవర్నమెంట్ హాస్పటల్‌కు తరలించగా చికిత్స పొందుతూ 18న మృతి చెందాడు. అంగలకుదురు వీఆర్వో ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

పోలింగ్ బూత్‌లపై సమావేశం



వేమూరు: పోలింగ్ బూత్‌లపై అవగాహన కలిగి ఉండాలని నియోజకవర్గ ఎన్నికల అధికారి ఎం.నాగిరెడ్డి అన్నారు. స్థానిక తహసీల్దారు కార్యాలయంలో వివిధ రాజకీయ నాయకులతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నియోజకవర్గంలో 1200 కన్నా ఎక్కువగా ఓట్లు ఉన్న పోలింగ్ కేంద్రాలను గుర్తించడం జరిగిందన్నారు. వేమూరు నియోజక వర్గంలోని కొల్లూరు మండలంలో నాలుగు పోలింగ్ కేంద్రాల్లో 1200 కన్నా ఎక్కువగా ఓట్లు ఉన్నాయని, ఆ ప్రాంతాల్లో కొత్త పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేస్తామన్నారు. బూత్ లెవల్ అధికారులు పోలింగ్ కేంద్రం పరిధిలోని కొత్త ఓట్లు నమోదు, మరణాలు తొలగించడం, చేర్పులు, తొలగింపు కార్యక్రమాల్లో నిర్లక్ష్యం చేయవద్దని సూచించారు. తహశీల్దార్ కె.సుశీల, వెంకటేశ్వర్లు, నెహ్రూబాబు, శ్రీనివాసరావు, నాగరాజరావు, రాజకీయ పార్టీల ప్రతినిధులు పాల్గొన్నారు.

ఇంటింటికి చంద్రబాబు మోసాలు

- వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ గణేష్
- రేపల్లెలో 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' సభ


సమావేశంలో మాట్లాడుతున్న డాక్టర్ ఈవూరు గణేష్

రేపల్లె: కల్లబొల్లి మాటలు చెప్పటం... నమ్మించి నయవంచన చేయటం, వెన్నుపోటు రాజకీయాలు చేయటం టీడీపీ అధినేత, ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు వెన్నతో పెట్టిన విద్యని వైఎస్సార్ సీపీ రేపల్లె నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరు గణేష్ మండిపడ్డారు. 'బాబు ష్యూరిటీ – మోసం గ్యారెంటీ' కార్యక్రమంలో భాగంగా పట్టణంలోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శనివారం నిర్వహించిన మండలస్థాయి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. మాజీ సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి అహర్నిశలు ప్రజల సంక్షేమమే కోరుకున్నారని, అనేక సంక్షేమ పథకాలను అందించారని గుర్తు చేశారు. నేడు ప్రజలను మోసం చేసి అధికారం చేజిక్కించుకున్న చంద్రబాబు సంక్షేమ పథకాలన్నింటికీ గ్రహణం పట్టించారన్నారు.

అన్నివర్గాలను మోసం చేశారు..

ఒక పథకం సక్రమంగా అమలు చేసిన దాఖలాలు లేదన్నారు. విద్యాసంవత్సరం గడుస్తున్నా నేటికి పూర్తిస్థాయిలో తల్లికి వందనం పథకాన్ని అందించలేకపోవటం ఆయన అసమర్థతను తెలుపుతోందన్నారు. రైతులు, చేనేతలు, మత్స్యకారులు ఇలా ప్రతి రంగం వారిని మోసగించారనటంలో సందేహంలేదన్నారు. ముఖ్యంగా మహిళలను నయవంచన చేసిన విషయాన్ని గుర్తు చేశారు. ఉచిత బస్సు ప్రయాణం, నెలకు రూ.1500లు వంటి వాటితో పాటు అనేక పథకాలకు మంగళం పాడారన్నారు. నిరుద్యోగులను నట్టేటా ముంచారన్నారు. పేదలకు స్థలాలు అందిస్తామని ప్రగల్భాలు పలికి నేటికి ఆ విషయంపై నోరు మెదపకపోవటం విడ్డూరంగా ఉందన్నారు. సూపర్ సిక్స్ అమలు చేయటంలో చంద్రబాబు అట్టర్ ఫ్లాప్ అయ్యారన్నారు. చంద్రబాబు పాలనలో జరుగుతున్న అచారకాలను, అవినీతిని, అమలు చేయని హామీలను ప్రజలకు తెలియజేసేందుకు కార్యకర్తలు ఇంటింటికి వెళ్ళి చైతన్య పరచాలని పిలుపునిచ్చారు. వైఎస్సార్ సీపీ రూరల్, పట్టణ కన్వీనర్‌లు మేడికొండ అనిల్, కరేటి శేషగిరిరావు, పార్టీ జిల్లా ఉపాధ్యక్షుడు చదలవాడ శ్రీనివాసరావు, జిల్లా అధికార ప్రతినిధి కేవీ కృష్ణారెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ సెక్రటరీ నిజాంపట్నం కోటేశ్వరరావు, మహిళా విభాగం నియోజకవర్గ అధ్యక్షురాలు వీసం నాగలక్ష్మి, నాయకులు బొర్రా శ్రీనివాసరావు, సజ్జా పద్మావతి, రాజశేఖర్, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ నేతకు చెందిన గడ్డివామికి నిప్పు

- రూ.లక్ష విలువైన 6 ఎకరాల గడ్డివామిను దగ్ధం చేసిన టీడీపీ నేతలు
- పరిశీలించిన పార్టీ రేపల్లె, వేమూరు సమన్వయకర్తలు డాక్టర్ గణేష్, అశోక్‌బాబు


దగ్ధమైన వరిగడ్డి వామిని పరిశీలిస్తున్న డాక్టర్ ఈవూరి గణేష్, అశోక్‌బాబు

నగరం: మండలంలోని అద్దంకివారి పాలెంలోని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్యకు చెందిన వరిగడ్డి వామికి శనివారం తెల్లవారుజాము సమయంలో టీడీపీ నాయకులు నిప్పు అంటించిన ఘటనలో సుమారుగా 6ఎకరాల గడ్డి వామి దగ్ధమైంది. స్థానికులు రేపల్లె అగ్నిమాపక సిబ్బందికి తెలపడంతో సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటను అదుపు చేశారు. సుమారు రూ.లక్ష ఆస్తినష్టం వాటిల్లినట్లు బాధితుడు బాపనయ్య ఆవేదన వ్యక్తం చేశారు.

వైఎస్సార్ సీపీ నేతల ఆస్తుల ధ్వంసం సరికాదు..

వైఎస్సార్ సీపీ నాయకులపై కక్ష సాధింపులకు పాల్పడటం మంచి పద్ధతి కాదని పార్టీ నియోజకవర్గ సమన్వయకర్త డాక్టర్ ఈవూరి గణేష్ అన్నారు. వైఎస్సార్ సీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి లుక్కా బాపనయ్యకు చెందిన దగ్ధమైన వరిగడ్డి వామిని పార్టీ వేమూరు నియోజకవర్గ సమన్వయకర్త అశోక్‌బాబుతో కలిసి పరిశీలించి బాపనయ్య కుటుంబసభ్యులను పరామర్శించారు. డాక్టర్ గణేష్ మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ నాయకుల ఆస్తులను ధ్వంసం చేయడం ఎంత వరకు సమంజసమన్నారు. అశోక్‌బాబు మాట్లాడుతూ తమ పార్టీ నేతలను భయభ్రాంతులకు గురిచేసేలా టీడీపీ నేతలు అరాచకాలకు పాల్పడుతున్నారన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణులకు అండగా ఉంటామన్నారు. పార్టీ నగరం, చెరుకుపల్లి మండలాల కన్వీనర్‌లు ఇంకోల్లు రామకృష్ణ, దుండి వెంకటరామిరెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి నిజాంపట్నం కోటేశ్వరావు, యువజన, వికలాంగుల విభాగం నియోజకవర్గ అధ్యక్షుడు దొంతిబోయిన కొండలరెడ్డి, తోలుచూరి బాలకృష్ణ, నాయకులు నాగేశ్వరావు, బాబురావు, సుబ్బారావు పాల్గొన్నారు.

టీడీపీ నాయకుడి పొలం, చెరువుకు అక్రమ విద్యుత్ లైన్


ట్రాన్స్‌ఫార్మర్ నుంచి లాగిన అక్రమ విద్యుత్ లైన్

అక్రమ విద్యుత్ లైన్ తొలగిస్తాం

కమ్మవారిపాలెం నుంచి పంట పొలాల్లోకి అక్రమ విద్యుత్ లైన్ ఏర్పాటు చేసినట్లు ఇప్పుడే తన దృష్టికి వచ్చింది. విద్యుత్ లైన్ తొలగించి వాటికి వినియోగించిన విద్యుత్ శాఖ మెటీరియల్‌ను స్వాధీనం చేసుకుంటాం.

– ఎండీ నాగుల్‌మీరా, విద్యుత్ శాఖ ఏఈ, నగరం

నగరం: సాధారణంగా నూతన విద్యుత్ లైన్ వేయాలంటే లైన్ అవసరమున్న వ్యక్తులు విద్యుత్ శాఖాధికారులకు దరఖాస్తు చేసుకోవాలి. అప్పుడు విద్యుత్ శాఖా ఏఈ ఆ ప్రాంతాన్ని పరిశీలించి ఎన్ని స్తంభాలు, వైరు ,కాసారాలకు వంటి వాటికి ఎంత ఖర్చుఅవుతుందో కొటేషన్ వేసి లైన్ ఏర్పాటుకు ఎంత నిధులు అవసరమవుతాయో చూసి సంబంధిత వ్యక్తుల నుంచి అమౌంట్‌ను డీడీ రూపంలో తీసిన తర్వాత విద్యుత్ లైన్‌ను వేయాల్సివుంది. లైన్ ఏర్పాటుకు కొన్ని నెలలు సమయం పడుతుంది. అయితే ఇవన్నీ సామాన్యులకే.. అధికార పార్టీవారికైతే ఇవేమీ వర్తించవు.. అక్రమంగా విద్యుత్ లైన్లు వేసేస్తారు.. వివరాల్లోకి వెళితే.. మండలంలోని కమ్మవారిపాలెంలో టీడీపీ నాయకుడి పంట పొలం , అక్రమ చెరువులకు విద్యుత్ లైన్‌ను రాత్రికి రాత్రే ఏర్పాటు చేస్తున్నారు. ఇది చూసిన చుట్టుపక్కల రైతులు అవాక్కవుతున్నారు. విద్యుత్ శాఖకు చెందిన కొంత మంది ఉద్యోగులు టీడీపీ నాయకుల ఎడల స్వామి భక్తి ప్రదర్శిస్తున్నారనే వాదనలూ వినిపిస్తున్నాయి. అక్రమంగా విద్యుత్ లైన్ వేశారని విద్యుత్ శాఖాధికారులకు తెలిసినా ఎందుకు చర్యలు తీసుకోవడం లేదనే విమర్శలు తలెత్తుతున్నాయి.

విద్యార్థి దశ నుంచే చట్టాలపై అవగాహన అవసరం

ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి


సమావేశంలో మాట్లాడుతున్న న్యాయమూర్తి జి.వాణి

బాపట్లటౌన్: విద్యార్థి దశనుంచే చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగి ఉండాలని బాపట్ల ప్రిన్సిపల్ సివిల్ జడ్జి జి.వాణి తెలిపారు. పట్టణంలోని సరస్వతి మెమోరియల్ ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో బాపట్ల మండల సేవాధికార కమిటీ ఆధ్వర్యంలో శనివారం న్యాయ అవగాహన సదస్సు నిర్వహించారు. సివిల్ జడ్జి జి.వాణి మాట్లాడుతూ విద్యార్థి దశనుంచే ముఖ్యంగా పోక్సో యాక్ట్, లైంగిక వేధింపుల నిరోధక చట్టంపై అవగాహన కలిగి ఉండాలన్నారు. విద్యార్థులు అశ్లీలత, లైంగిక వేధింపుల నుంచి రక్షించడానికి నేరాల విచారణ కోసం ప్రత్యేక కోర్టులను ఏర్పాటుచేయటం జరిగిందన్నారు. విద్యార్థులకు గృహహింస, భరణం, విద్యాహక్కు చట్టం, ర్యాంగింగ్ వంటి చట్టాలపై పూర్తిస్థాయిలో అవగాహన కలిగించారు. న్యాయవాదులు భీమా లీలాకృష్ణ, కంచర్ల రవిబాబు, రామాంజనేయులు, కళాశాల ప్రిన్సిపాల్ బి.నాగమణి, లెక్చరర్లు, విద్యార్థులు పాల్గొన్నారు.